లేదు. ఆలోచిస్తున్నాను అప్పుడే. ఆ బేంక్ మేనేజర్ ఫోన్ చేయగానే ఎంత త్వరగా వస్తారు పోలీసులు? ఈ కారు నంబరు గుర్తుపెట్టుకుని పోలీసులకి చెప్పివుంటాడా? కనీసం చాక్లెట్ కలర్ ఫియట్ కారని చెప్పినా చాలు. వైర్‌లెస్ సౌకర్యంవున్న పోలీస్ పెట్రోల్‌కారు బహుశ ఇప్పుడు ఇటే వస్తుందేమో?

దూరంగా ఆగివున్న ఆటోని చూశాక వెంటనే ఏంచేయాలో నిర్ణయించుకున్నాను.

మొహంమీద తొడుక్కున్న సంచిని చింపేశాను, విప్పదీస్తూంటే ముసలాయనికి తిరగబడే అవకాశం కలగొచ్చని.

"ఆ ఆటో ప్రక్కనఆపు కారు. ఆగాక తాళం చెవులగుత్తి నాకివ్వు! లేదా....?"

కారు ఆటో ప్రక్కన ఆపాడు. ఈలోగా సంచీలో సీటు శుభ్రంగా తుడిచాను వేలిముద్రలు చెరిగిపోవడానికి.

కారుదిగి నవ్వాను గట్టిగా.

"అలాగేసార్.... తప్పకుండా వస్తాను. థాంక్స్ ఫర్ ది లిఫ్టు. ఆటో వుందిగా వెళతాను."

మాట్లాడుతూ కారు తలుపు పిడిమీద వేలిముద్రలు తుడిచేసాను సంచితో. ముందు తలుపు కిటికీలోంచి వంగి ఇగ్నిషన్‌కీ అందుకున్నాను.

ఆయన నా మొహంవంక ప్రశాంతంగా, నిశితంగా చూశాడు.

నన్ను గుర్తుపడతాడా మళ్ళీ ఇంకోసారిచూస్తే?

"జాగ్రత్త! నన్నెప్పుడైనా గుర్తుపడితే, పోలీసులకి సహాయం చేస్తే ఈ భూమ్మీద నూకలు చెల్లినట్లే నీకు. ఇక్కడగొడవచేస్తే పొడిచేస్తాను వెంటనే."

రహస్యంగా, కర్కశంగా చెప్పాను.

ఆటోలో కూర్చుని "పోనీ" అన్నాను.

2)

